కృష్ణాపత్రిక: 16-6-62

# మలుపు

నాంది :

నేను కథకుణ్ణి, అందులోనూ ఆధునికుణ్ణి. అందువల్లే గావచ్చు. నా కథల్లో నాబోటి వారు, వారి జీవితాలు తగుదునమ్మా అని చొరవ తీసుకుని నాకు తెలియక కనుపిస్తుంటాయి. ఇతి ఆత్మభూషణ కాదు. నిజం, ఎందుకంటే వెంకటరత్నంగారు చాలా బాగా తెలుసు నాకు. ఆయనే ఇందులో ముఖ్యపాత్ర!

కథకుడు:

వెంకటరత్నం భారీ మనిషి. చెరువు గట్టు మీద ఒంటరిగా, నిలబడున్న పెద్ద రావి చెట్టులా వుంటారు. అలా అనిపిస్తారు. నల్లగా తారుతో సమానంగా వుంటారు. నల్లటి పిడతకు సున్నపు బొట్లు పెట్టినట్లు కళ్ళు, గీతల్లా పళ్ళు తెల్లగా! నెత్తిమీది జుత్తు నెరిసి, కోతకొచ్చిన వరిచేనులా, సరుకు అయిపోయిన బొగ్గుమసిలా వుంటుంది. కత్తిరించబడ్డ క్రాపు వెనుక తల ముడి వేసిన పిలక! ఉదికిన ఖద్దరు తప్ప కట్టడు. చాలా తక్కువగా మాట్లాడుతాడు.

ప్రస్తావన:

నేను ఉద్యోగరీత్యా, ఆ వూరు వెళ్ళాను. కృష్ణానదీ తీరంలో చిన్న పల్లెటూరది. దగ్గర లోనే ఒక మాదిరి బస్తీ వుంది. ఏం వున్నా ఏం లేకపోయినా కడుపు చేత్తో పట్టుకుని కాని దేశం పోయిన తరువాత ఏ వూరయితేనేం అన్నది, మనసులో వుంటుంది. వచ్చిన నాట్నుంచీ, మా ఆవిడ ఒకటే సణుగుడు ఇంట్లో.

"ఏం వూరండి ఇది. మన కులం వాళ్ళు చూద్దామన్నా లేరు. మధ్యాహ్నం అప్పుడు, కాసేపు మాట్లాడుదామంటే మనిషే కనబడరు. మీకేమోగానీ, నాకు అరణ్యంలో కాపుర మున్నట్లుంది!" అని అంటుంది. నేను నవ్వుతాను, దాని మాటలకు! నేను ఆమె మాటలు లెక్కచెయ్యడంలేదని దానికి చిరుకోపం వస్తుంది.

"మీకేం! మగవారు. ఏ సాయంత్రమో అలా ఏటి దగ్గరకెళ్ళి కూర్చుంటే కాలక్షేపం అవుతుంది - మాకేముంది. బోనులో ఎలుకలా ఈ కొంపే అన్నీనూ! అయినా, వాళ్ళు పాముకన్న చోటికల్లా బయలుదేరి రావటమేనా! మార్పించుకోకూడదూ మంచి వూరికి. ఆ సత్యమూర్తి చూడండి, ఆ వూర్నొదిలి ఎలా రాడో? మీరే అందరికీ లోకువ" అని అంటుంది. మా ఆవిడకు లోకం పోకడ అంతగా తెలియదు. ఆ సత్యమూర్తి అనే మనిషికి

చెట్టంత మామ, పలుకుబడీ, ప్రాపకం దగ్గర పెట్టుకుని మరీ బ్రతుకుతున్నాడని తెలియదు. చెబితే అర్థంగాదు.

ఈ వూరొచ్చింతరువాత, కృష్ణానదికి వెళ్ళటం అలవాటు చేసుకున్నా; చిన్నప్పుడు హైస్కూల్లో చదివేప్పుడు నదిలో ఈత కొట్టడం నేర్చుకున్నా, చాలా రోజులకి మళ్ళీ కృష్ణ వేణిని చూసేసరికి, నిద్రపోతున్న భుజాలు, ఆకలిగొన్న సింహాల్లా లేచినయ్! నాకు, ఏదో పని లేకుండా నిస్సత్తువగా కాలం గడిపేకన్నా, ప్రొద్దున్నే కృష్ణా తరంగాల్లో తేలిపోవాలని మనసు పుట్టింది. తెల్లవారంగానే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, ఏటికి వెళ్ళేవాణ్ణి. ఉదయం ఏడింటికల్లా స్కూలుకు హాజరవ్వాలి. అందువల్లనూ, వూరికీ నదికీ కాస్త దూరం అవటం వల్లనూ, చీకటి తెరలు పూర్తిగా విచ్చిపోకముందే, బయలు దేరాల్సి వచ్చేది.

వెంకటరత్నంగారిని మొదట కలుసుకుంది నది ఇసుకలో! నే వెళ్ళేసరికే ఆయన స్నానం ముగించి తడి అంగవస్త్రం గట్టిగా పిండి, భుజం మీద వేసుకుని, పెద్ద రాగి చెంబుతో నీళ్ళు తీసుకుని, గృహోన్ముఖులవుతున్నారు. ఏదో మంత్రం కూడా జపిస్తూ, ఇసుకలో వడి వడిగా నడిచివెళ్ళారు - ఒకసారి నా వైపు సాలోచనగా చూసి.

మొదటి రోజు ఆయన్ను గురించి కలిగిన ఆలోచనలు, ప్రతిరోజూ నా కన్నా ముందర స్నానం ముగించి వచ్చే ఆయన్ను పూర్తిగా తెలుసుకోవాలనిపింపచేసినయ్.

ఎవరా ఈయన అన్నది సందేహం?

సాయంత్రం బడి వదలగానే, ఏటి యిసుకలోకెళ్ళి ఒంటరిగా కూర్చునే వాణ్ణి. అనంత మైన నీలిమ ఆకాశం, నీలంగా ప్రవహించే నీళ్ళు, తెల్లటి ఇసుక, దూరంగా నల్లని కొండల వరుస చూస్తూ గడిపేవాణ్ణి.

ఆ సమయంలోనూ, నడుముల్లోతు నీళ్ళల్లో నిలబడి, అస్తమించే సూర్య భగవానుడికి అర్ఘ్యం ఇస్తూ కనపడేవారు వెంకటరత్నంగారు.

ఆయన నన్ను ఎవరా? అన్న విధంగా చూస్తూ వెళ్ళేవారు. కానీ, మా ఇద్దరికీ పరిచయం కలుగలేదు.

కానీ నా మనస్సు ఆగలేదు, ఆయన్ను గురించి తెలుసుకుందామన్న ఉత్సుకత ఏర్పడింది.

తోటి పంతులు, "ఆయనాండి. పేరు వెంకటరత్నంగారని, చాలా తమాషా మనిషి. ఈ వూళ్ళోకి క్రొత్తగా వచ్చినప్పుడు నాకూ మీలాగానే సందేహాలు కలిగాయి. ఆయన్ను గురించి చాలా కథలున్నాయి. కానీ నేను విన్నవాటికి కూడి తీసెయ్యంగా తేలిందేమంటే ఆయన స్వగ్రామం మాత్రం ఇది గాదు. ఏ వూరో ఎవరికీ తెలియదు. ఈ గ్రామం వచ్చి పదెకరాల ఒకటోరకం పొలం కొన్నాడు. ముచ్చటైన మామిడితోట కొని అందులో చక్కటి ఇల్లు కట్టాడు. ఇల్లు మీరు చూడలేదేమో! వీలయితే చూడండి. చూడతగ్గది గూడాను.

అద్దంలా శుభ్రంగా, అవయవాల పొందికగల స్త్రీ శరీరంలా వుంటుంది ఇల్లు. ఇంటి ముందర పూల మొక్కలు, రకరకాలవి వుంటాయి. ఆయనెప్పుడు చూసినా తీరికగా వుండడు. ఆయన నిత్యకృత్యాలు యంత్రాల్లా గడిచిపోతాయి. తెల్లవారేసరికి, స్నానం ముగించి ఇంట్లో జపం చేసుకుంటారు. జపం పూర్తవగానే పొలాల వేపు వెళ్ళి, ఒక్కసారి అన్నీ పర్యవేక్షించి వస్తారు. ఆ తర్వాత వంట కాగానే భోజనం పూర్తి చేసుకుని, ఏదో ఒక పుస్తకం చదువుతూ కాలం గడుపుతారు. సాయంత్రం వేళ పొలాల వేపు వెళ్ళి సూర్యాస్త మయం వేళ కృష్ణకు వెళతారు. రాత్రికి వంట భోజనం కానిచ్చుకుని, మరలా పుస్తకం పుచ్చుకుంటారు నిద్ర వచ్చేవరకూ. మర్చిపోయాను, ఆయనగాక ఆ ఇంట్లో ఒక పన్నెండేళ్ళ కుర్రవాడు మాత్రం వుంటాడు."

భిక్షాలు:

మా అయ్యగారి పేరు మీకు తెలుసుగా! ఆయన చాలా ఖచ్చితమైన మనిషి. రోజూ జరిగే పనుల్లో ఏదీ ఆలస్యం కారాదు. అయితే క్షమించరు. పది నిముషాలు జపం చేసుకోవాలి అంటే అంతే! మరో నిమిషం పూజలోకి రాగూడదు. ఆయన పన్లు గూడ అంతే! మాటంటే తిరుగులేదు. ఒకరోజు ఏం జరిగిందనుకున్నారు - ఆయన స్నానం చేసి వస్తుంటే, ఓ మాల మనిషి, గర్భిణీ కూడనట, ఏటి నుండి నీళ్ళు తెస్తూ, ఆయాస పడుతూ, వూళ్ళోకి రావటం చూశారు వెంకటరత్నం అయ్యగారు. పైగా చంకలో పసిపిల్ల, అప్పుడేమో ఎండాకాలం గూడ! కృష్ణానదిలో నీళ్ళు లేవు. ఏటి గట్టుకు దూరంగా ఓ పాయలో మాత్రం కాసిని వున్నాయి. అవే తెచ్చుకోవాలి అందరూను. పైగా పాట్లో ఒక్క బావన్నా లేదు.

ఆ రాత్రికి రాత్రే పాట్లో వాళ్ళను పిలిపించి తన ఉద్దేశ్యం చెప్పారు. "మీ కందరికి అనువైన చోట బావి త్రవ్విస్తాను!" అని. కొంతమంది, "అసలీ వూళ్ళో జలే పడదు సామీ! ఎందుకూ అనవసరపు డబ్బు దండగ" అన్నారు. మరికొందరు, "అడుగున చట్టు తగుల్తుంది! మీ ఇష్టం - అనక విచారించి లాభం లేదు" అనన్నారు. ఎందరేమన్నా మా అయ్యగారు మాత్రం తన ఆలోచనకు కార్యరూపం ఇవ్వటం మానుకోలా!

మర్రోజే పాట్లో మనుషుల్నే పిలిపించి, బావి త్రవ్వకం ప్రారంభింపచేశారు! సగం త్రవ్వే సరికి చట్టుపడింది. డబ్బు తీసుకు త్రవ్వే మనుషులన్నా నిరుత్సాహపడ్డారు గానీ, మా అయ్యగారు నిరాశ చెందలా! ఎంత ఖర్చయినా సరే వెనక్కు తీయక పట్నం నుంచి బోరింగు మిషను గూడ తెప్పించి నీళ్ళు రప్పించారు పైకి. ఇప్పుడు మాల మాదిగలంతా ఆ బావి నీరే మామూలు వాడకానికి తెచ్చుకుంటారు. ఇంకోసారి ఇలాగే మాల మాదిగలకు సహాయం చేశారు. అప్పుడూ ఏకధాటిగా వారం రోజులు గాలీ వానాను. బీదా బిక్కి కూటికీ గూడుకీ అల్లాడారు. అప్పుడు ఈ అయ్యవారు అందరికీ ఇళ్ళు వేయించి, గింజలు కొలిపించారు. మా అయ్యగారు దేవుడే నిజంగా! ఆయనింటికి

ఎవరు వచ్చినా ఆయనతోపాటే భోజనం చెయ్యాల్సిందే! కుల, మతాలు లేకుండా తనతో పాటు చూస్తారు. ఎంత మంచి హృదయం గాకపోతే దిక్కూ దిబాసీ లేని అనాథను నన్ను ఉంచుకుని, అన్నం గుడ్డలూ పెట్టి, రాత్రిళ్ళు చదువు గూడ చెబుతారు! ఆయన నిజంగా దేవుడు. కానీ ఈ వూరి జనం మాత్రం, ఆయన గురించి రహస్యాలు లాగాలని నన్ను బలవంత పెడుతుంటారు.

"ఆయన్దేవూరు రా భిక్షాలు?"

"తెలియదు"

"పోనీ ఏ మాత్రం ఆస్థి, డబ్బు వున్నాయేమిటి? దాన ధర్మాలు తెగ చేస్తుంటాడు?"

"తెలియవు!"

"పోన్లే ఒక్క సంగతి చెప్పు! అయ్యగారికి పెళ్ళాం పిల్లలూ లేరేమిట్రా? ఒక్కడూ అలా వుంటాడు?"

"నాకేమీ తెలియవు నన్నడక్కండి!"

కానీ నమ్మరు జనం! ఎందుకో ఆ వివరాలన్నీ వీళ్ళకు. తమలో వున్న లోటుపాట్లు ఎదుటి మనిషిలో వున్నాయా లేవా అని చూచుకుంటేగానీ తృప్తి వుండదు గామాలు వీళ్ళకు.

కథకుడు:

నిజంగా, వెంకటరత్నంగారు తమాషా మనిషే! ఒకరితో ఆయనకు ప్రమేయం లేదు. తన సహాయం కోరి వచ్చిన వాళ్ళను త్రోసిరాజనడు. నే వచ్చి ఎన్నో రోజులు గడుస్తున్నా, ఆయనతో నే కోరుతున్న పరిచయం లభించలా! నాకై నేను పరిచయం కలుగచేసుకుందా మంటే, అందుకు అవసరమైన చొరవ నాలో లేదు.

ఇక్కడ నా గురించి మరల కొంత చెప్పుకోవాలి మీకు. నాకు రెండేళ్ళ కుమార్తె వుంది. చాలా అందమైనదే. మా అమ్మాయికి రెండు రోజులు సుస్తీ చేసింది. ఆ అమ్మా యంటే మాకు చాలా ప్రేమ. ఇంతకు మునుపు, ఓ మొగపిల్లవాడు పుట్టి, కొంతకాలం పెరిగి చనిపోయి వుండటం వల్ల, ఆ పిల్లంటే మాకు అభిమానమూ, అపేక్ష వుండటంలో ఆశ్చర్యమేం లేదనుకుంటాను. పై కారణాలవల్ల, నా దినచర్యల్లో అత్యవసరంగా మార్పు చెయ్యాల్సి వచ్చింది. ఉదయం సాయంత్రం బడి వేళలు మినహా, మిగతా కాలం ఇంట్లోనే కూర్చుని వుండేవాణ్ణి. మా ఆవిడ గూడ నేనింట్లో వుండటం అవసరంగా భావించింది.

ఓ రోజు రాత్రి, అంటే ఆ వేళకు మా పాపకు సుస్తీ చేసి మూడు రోజులైందన్నమాట. వెంకటరత్నంగారు మా గడపలో ప్రత్యక్షమయ్యారు. నా మటుకు నేను ఆశ్చర్యపోయాను. ఆశ్చర్యం నుంచి తేరుకుని -

"రండి! ఇది పరాయి ఇల్లుగా భావించకండి!" అని ఆయన్ను ఆహ్వానించాను.

ఆయన మెల్లగా నవ్వారు.

"మీ పాపకు అనారోగ్యంగా వుందని తెలిసి వచ్చాను" అన్నారు ఆయన!

చూపించాను పాపను. మూసిన కన్నెరక్కుండా పాప నిద్రపోతున్నది. పాప ఈ మూడు రోజుల్లో బాగా దూసుకుపోయింది. ఆయన చెయ్యి పుచ్చుకు చూశారు.

"మందు వాడుతున్నారా?" అనడిగారు.

"లేదండి."

"అవును ఈ వూళ్ళో వైద్యుడు లేడు!" అని, "అమ్మాయి యింట్లో వుందా?" అని అడిగారు.

మా ఆవిడను పిలిచాను. వచ్చింది. "బాబుగారు వచ్చారు" అన్నా! అనాలని అనలేదు. అలా అని, ఆలోచించుకోనూ లేదు. ఆయనంటే నాకు కలిగిన ఏదో గురుభావం అలా అనమని ప్రోత్సహించింది! మా ఆవిడకు పూర్వాచారాలంటే తగని ఇష్టం. ఆయన ఆశీర్వదించారు.

"నయమవుతుందిలేమ్మా! భయపడకండి. వూరుగాని వూరు. ధైర్యం చెబుదామని వచ్చానంతే! పూజవేళప్పుడు వచ్చేట్లయితే తీర్థమూ, విభూతీ ఇస్తాను."

ఆయనింకేం మాట్లాడలా! నేనూ, ఏం మాట్లాడలా! ఆయన చెప్పినట్లు విభూతీ, తీర్థమూ తెచ్చి పాపకు ఇచ్చా!'

"దేవుడండీ ఆయన! అమ్మాయి వొళ్ళు పేలిపోతున్నది ఈ మూడు రోజుల నుంచీ. చూడండి, ఎలా తగ్గిందో! హాయిగా నిద్రగూడ పోతున్నది!"

మా ఆవిడ ముఖం, ఆనందమూ, కృతజ్ఞతలతో విప్పారింది.

"అవును!" అన్నాను మరేమనలేక!

"ఇలాంటి మహాత్ములుండబట్టే ఇంకా ఈ భూమి ఇంత మాత్రమన్నా వుంటుందనుకోండి!" అని భక్తితో కళ్ళు మూసుకుంది.

ఇలాంటి మహాత్ములు లేకపోతే ఈ భూమి మరెలా వుంటుందో నాకు తెలియదు. అంతమాత్రాన వెంకటరత్నంగారి వ్యక్తిత్వాన్ని నేను శంకిస్తున్నానని అనుకోవటం శుద్ధ పొరపాటే అవుతుంది.

తదాదిగా రోజు ఆయనింటికి వెడుతుండేవాడిని. వెళ్ళి చేసేదేమి గూడ లేదు. పోగానే చిరునవ్వుతో ఆహ్వానిస్తారు. అంతే! అవసరమైనంత మితంగా మాట్లాడతారు. వచ్చేప్పుడు ఆయనకున్న లైబ్రరీలోంచి ఏదన్నా పుస్తకం తెచ్చుకుండేవాడిని.

"మీకు ఇంగ్లీషు గూడ వచ్చునా?"- ఆయన బీరువాలో ఇంగ్లీషు నవలలు, తాత్విక, వేదాంత గ్రంథాలు వుండటం చూసి అడిగాను.

వచ్చునన్నట్లు తల వూపారు. కానీ ఎంతవరకు చదువుకున్నారో, అడగటానికి ధైర్యం చాలలా! వచ్చే సమాధానమేమిటో నేనే వూహించుకున్నాను.

'పుస్తకం చదివి అర్థం చేసుకునేంతవరకూ చదువుకున్నాను!' అని అంటారు ఆయన.

ఆయన సాహచర్యం వల్ల కొన్ని క్రొత్త విషయాలు తెలుసుకున్నా. నియమబద్ధమైన జీవితము గడుపుతున్నారు అని ఆయన నిశ్చయించుకున్నాను. ఆయన గూడ పొరబాటున గూడ ఆ ప్రసక్తి తెచ్చేవారు గాదు.

:: 2 ::

భిక్షాలు:

నిన్న ఉదయం అయ్యగారు వూరికెళ్ళారు. రాత్రి వచ్చారు. ఆయన సామాన్యంగా ఎప్పుడోగాని, వూరు వదలి వెళ్ళరు. వెళ్ళినా రాత్రికి ఇంటికి రావాల్సిందే. అదీ ఇంతవరకు జరుగుతున్నది. అందుకు భిన్నంగా ఇంతవరకూ జరగలేదు. రాత్రి అయ్యగారు ఒక్కరే రాక, వేరే ఓ ఆడమనిషిని తీసుకొచ్చారు. ఆ యమ్మ వెంట ఓ మూడేళ్ళ పిల్లాడూ వచ్చారు.

అయ్యగారు ఆ వచ్చిన వాళ్ళ గురించి ఏమీ చెప్పలా తనతో! తనూ అడగలా! చెప్పాల్సిన విషయమైతే ఆరే చెబుతారని! ఆవిడకు పాతిక సంవత్సరాలకు పైగా ముప్ఫయికి లోపూ ఉంటయి. సన్నగా తెల్లగా వున్నది. నా చూపులకు మంచిదిగానే వుంది. ఆ యమ్మ కంటే పిల్లాడు బొద్దుగా, అందంగా వున్నాడు. బలే తమాషాగా నవ్వుతాడు. ప్రొద్దున రమ్మని సైగ చెయ్యగానే వచ్చి, వీపెక్కాడు. కబుర్లు గూడ మా బాగా చెబుతాడు. ఆ యమ్మ వచ్చినాళ నుంచీ, అయ్యగారు వంట చెయ్యటం, ఆ యమ్మ కొప్పజెప్పి, అయ్యగారు ఆ అబ్బాయిని ఆడించడం మొదలెట్టారు. ఆ అబ్బాయి పేరు మురళిట! అయ్యగారి మొహమంతా పీకుతూ, నవ్వుతూ అటెత్తుకుపొమ్మని, ఆ పువ్వు కావాలని, యీ పుస్తకం కావాలని మహా అల్లరి చేస్తున్నాడు! అయ్యగారు అన్నిటికీ ఆ పిల్లబాబు చెప్పినట్లు చేస్తుంటే ఆ యమ్మ కళ్ళ నీళ్ళు ఎందుకో తుడుచుకోవటం చూశాను. మరి అది సంతోషమో, బాధో మరి?

కథకుడు:

భిక్షాలుకు ఏం తెలియదన్నాడు వచ్చిన వాళ్ళను గురించి అడిగితే! అసలు వెంకట రత్నంగారు వూరెళ్ళి వచ్చారేమోనని వెడితే, తోటలో భిక్షాలు ఓ పిల్లవాణ్ణెత్తుకు కనబడి సంగతి చెప్పాడు. వెంకటరత్నంగారు లేరని తెలిసి వస్తుంటే ఆయనే కనుపించారు. ఇంటికి రమ్మన్నారు. వెళ్ళాను. మామూలుగా కూర్చున్నా. ఆయనేం మాట్లాడలా! అది మామూలే! కానీ, వచ్చిన వాళ్ళను గురించి ఆయనే ఏదన్నా చెబుతాడని ఆశించా! కానీ అలాటిదేం జరగలేదు. ఆ తర్వాత రెండు రోజులకు నా భార్య అడిగింది.

"ఎవరండీ వెంకటరత్నంగారింటికి ఓ ఆడమనిషీ, పిల్లాడు వచ్చారట?" అని.

"నాకు తెలియదు. వచ్చిన మాట మాత్రం నిజమే!"

నమ్మలేదు నా మాటలు.

"అంత ఇష్టం లేకపోతే చెప్పకండి. అంతేగాని మీకు తెలియదంటే నమ్మేంత పిచ్చిదాన్ని గాదు."

"సరే నీ ఇష్టం!"

"రోజూ వాళ్ళింటికి వెళ్తారే, మీకు తెలియదదంటే ఎల్లానమ్మేది? అయినా, ఆ మాత్రం తెలియకపోదు. ఇవ్వాళ గాకపోతే రేపైనా తెలియదూ?" అని అన్నదే గానీ అలా జరగలేదు. పది రోజులు గడిచినా, అసలు సంగతే తెలియలేదు. ఒకరోజు మా ఆవిడే అంది, రహస్యం చెబుతున్నట్లు నాతో!-

"మెళ్ళో మంగళసూత్రాలూ, మొహాన బొట్టు వున్నాయా ఆవిడకు?" అని అడిగింది.

చెప్పాను.

"అయితే ఇంకేం! ఎదురింటి నారాయణమ్మ అన్నమాట నిజమేనన్నమాట!" అన్నది ఆశ్చర్యపోతూ!

"ఏమందేం?"

"ఆయన వుంచుకున్నదిట అది. ఇన్నాళ్ళబట్టి బస్తీలో వుంచి, ఇప్పుడు తీసుకొచ్చాడట. ఏదో పెద్దమనిషనుకున్నాను సుమా ఇన్నాళ్ళబట్టీ!" అని తప్పు తెలుసుకున్నదానిలా అంది.

"మనకు అసలు సంగతి తెలియనప్పుడు, నోటికొచ్చినట్లు అనుకోవటం ధర్మం గాదు. అయినా, నీ మాట నిజమనుకోటానికి ఆస్కారమూ లేదు!"

"అంతేలెండి! కళ్ళ ముందు కనుపించేదానికన్న సాక్ష్యమింకేం కావాలి?"

కానీ తర్కాలు, వాదనలూ విషయాన్ని నిర్ణయించలేవని నా నమ్మకం!

ఒకరోజు నాకు వెంకటరత్నంగారు కబురంపారు రమ్మని, వెళ్ళాను. నే వెళ్ళేసరికి నా కోసం ఆయన కాసుక్కూర్చున్నారు. నన్ను చూసి మా బడితోట మరో అంచుకు దారి తీశారు.

ఇద్దరమూ వెళ్ళి ఓ చెట్టు క్రింద కూర్చున్నాం!

వెంకటరత్నంగారు:

నే చెప్పింది వినండి. ఆలోచించండి. నేను గుంటూరు వెళ్ళినప్పుడు ఒకసారి జయమ్మ అనే అమ్మాయిని కలుసుకున్నాను. అదీ 'యాదృచ్ఛికంగా'నే! అక్కడ నా మిత్రుడున్నాడు, ప్లీడరు. ఎప్పుడన్నా అతడి దగ్గరకు వెడుతుంటాను. అక్కడ వుండగా నేను, ఓ చక్కటి కుర్రాడు వచ్చాడు నా దగ్గరకి! చూడ ముచ్చటైంది. "నీ పేరేమిటోయ్?" అన్నాను. చెప్పాడు. ఇంతలోనే, ఆ అబ్బాయి తల్లి జయమ్మ వచ్చింది. పిల్లవాణ్ణి తీసుకెళ్ళింది. నా మిత్రుడు చెప్పాడు వివరాలు. భర్త ఒదిలేశాట్ట ఆ అమ్మాయిని. కన్నవాళ్ళనీ, అయినవాళ్ళనీ వదిలేసి, ప్రేమించినవాడితో వచ్చి, ఒక పిల్లవాడు గూడ కలిగింతర్వాత, ఆ ప్రేమించిన వాడు వదిలేశాట్ట జయమ్మని. అప్పట్నుంచీ, స్వయంశక్తి మీద బ్రతుకుతోందిట. ఆ ప్లీడరు గారింటి ప్రక్క గదిలో వుంటున్నది. ఆ అమ్మాయి ప్రవర్తన, మంచితనం ఆకర్షించాయి నన్ను. అందుకని ఆ అమ్మాయికి నా సహాయం అందిద్దామని ఇక్కడికి తీసుకొ

చ్చాను. ఇదేమీ తప్పు కాదనుకుంటాను?

"మీరన్నట్లు అది మంచి పనే."

"అయితే పేరు కోసం మాత్రం నేను ఆ పని చెయ్యలా ఆ అమ్మాయే జయమ్మ. నిన్న సాయంత్రం మా మిత్రుడు ప్లీడరు దగ్గర్నుంచి ఓ ఉత్తరం వచ్చింది, చాలా ముఖ్యమైన విషయమవటం వల్ల దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చున్నా, మా జయమ్మ కొడుకు మహా అల్లరివాడు, నా ఆల్బము ఎక్కడో దాచిపెట్టింది బయటకు లాగాడు, వెళ్ళి వాళ్ళమ్మకు చూపించి, కేరింతలు కొడుతూ, బొమ్మలు చూస్తున్నాడు. ఆ సంగతి, తర్వాత తెలిసింది. లోపల్నుంచీ, మా మురళి, "అమ్మా.... ఏడుస్తున్నావెందుకే....అమ్మా!" అని ఏడవటం కనిపించింది. లేచి, లోపలికెళ్ళేసరికి, జయ కళ్ళు తుడుచుకుంటూ మురళిని సముదాయి స్తున్నది. నన్ను జూసి ఒక విధంగా విచలిత గూడ అయింది.

"ఏం జరిగింది?" అని అడిగాను.

జయమ్మ, ఏమీ లేదంది!

నేను నమ్మలా! "చూడు జయా! నా బిడ్డలాంటిదానివి. కావాలని అబద్ధమాడటం నేను సహించను. నీకు చేసిన సహాయం చూసి, నిన్ను బలవంతపెడుతున్నానని అను కోకు. కానీ, అబద్ధం చెప్పకు. అదే నేను కోరేది!" అని అన్నాను.

ఏమనుకుందో ఏమో ఆ తర్వాత వచ్చింది నా దగ్గరకు ఆల్బంతో. ఒక బొమ్మ చూపింది. "ఆయన ఎవరు?"అని అడిగింది.

చెప్పాను.

"నిజమా?" అన్నది - అబద్ధం చెప్పవని తెలిసీ గూడ!"

కథకుడు:

యింకా ఎన్నో సంగతులు వున్నాయని తెలుసు చెప్పాల్సినవి. కానీ చెప్పమని అడగ లేదు.

వెంకటరత్నంగారు:

నా సంగతి చెబుతాను వినండి. నేను డాక్టర్ని - మాది గోదావరి జిల్లా! వైద్యం చేసే రోజుల్లో మంచిపేరు, తీరని పనీ వుండేది. కానీ, అవే నా జీవితాన్ని నాశనం చేశాయి. వృత్తి మీద వున్నంత దీక్ష, భార్య మీద చూపలేకపొయ్యాను. నా భార్య చక్కనిది, భర్తగా నా ధర్మం నెరవేర్చాల్సినంతవరకు పూర్తి చెయ్యలేదు. అయినా ఆమె ఆగ్రహించలా! నెల తప్పింది ఆమెకు. దాంతోటి నాకు ఆమె శీలం మీద అనుమానమూ కలిగింది. ఆమె కడుపులో శిశువుతోపాటే, నా అనుమానం బలీయమై, ఆమె ప్రాణాలకే, ముప్పు తెచ్చాను. కానీ, భార్యకు చేసిన దుర్మార్గం, పుట్టిన పిల్లవాడికి, చెయ్యలేకపోయినా! అది దయో, నాలోని బలహీనతో తెలియదు. ఎలా పెరిగాడో ఆ పిల్లవాడు పట్టించుకోలా! కానీ పెరిగాడు. అతడికి వూహ వచ్చేసరికి కాన్వెంటులో చేర్చాను. అన్నిటికీ వాళ్ళే అయి,

అతణ్ణి పెంచారు. నేను పట్టించుకోలా! కాకపోతే డబ్బు పంపేవాణ్ణి. శలవులకు వచ్చేవాడు. అంటే - తండ్రీ కొడుకులుగా మాకే అనుబంధమూ లేదు. ఆపేక్ష లేదు. కానీ నా జీవితం లో అనుభవించాల్సిన సుఖమంతా, అనుభవించా. త్రాగా, స్త్రీలతో సంచరించా! అధికారం, ధనం, బలం, అన్నీ చూపి, నా సౌఖ్యానికి రాచబాటలు వేసుకున్నా. ఒకసారి ఒక నర్సును, బలవంతాన ఓ అర్ధరాత్రి, మానభంగం చేశా! అదే నా జీవితంలో మలుపు? ఆ నర్సు ఆస్పత్రి మూడవ అంతస్తు పైనుంచి దూకి, ఆత్మహత్య చేసుకుంది - అదే రోజు.

కొన్ని రోజులు స్తబ్ధంగా గడిచాయి. నాలోని మానవత్వానికీ, దానవత్వానికీ, మనసుకీ నా రాక్షసత్వానికీ, ఘోరమైన సంఘర్షణ జరిగింది.

అదే రోజుల్లో నా కొడుకు ఓ కాలేజీ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. అర్ధరాత్రి వచ్చి, తను చేసిన సంగతి చెప్పాడు. హనీమూన్ వెళ్ళాలి, గుడ్డలు కొనాలి, అది చెయ్యాలి, అని పైకం యివ్వమన్నాడు. లేదన్నాను - ఏమన్నాడో తెలుసా?

"ఫాదర్, డబ్బులేదంటే నేన్నమ్మను. వుంది నీ దగ్గర. లేకపోతే, నీ త్రాగుడికి, వ్యభిచారానికీ, జల్సాలకి, ఎక్కడ్నించి వస్తోంది డబ్బు? ఆ డబ్బే నాకూ కావాలి!" అన్నాడు.

నాలోని అహంకారము, వ్యక్తిత్వం బుస్సుమని లేచాయి.

"యు! రాస్కెల్! గెటవట్ ఫస్ట్, నీకే అధికారముంది, నన్ను ప్రశ్నించటానికి? నువ్వెవరు?" అని రెచ్చిపోయి అడిగాను.

"నీ కొడుకును ఫాదర్! నీ కొడుగ్గా అడుగుతున్నా - డబ్బు యివ్వు ముందర!"

"కొడుకువా? సిగ్గులేదూ! కొడుకట! ఒక పతితకు పుట్టినవాడ్ని దయా ధర్మంతో చావకుండా పెంచినందుకు యిదేనా ఫలితం! నీవు నా కొడుకువు కాదు! నా భార్యకు ఎవడికో పుట్టిన వాడివి! తెలుసుకో ఇప్పటికైనా!"

"ఫాదర్!" అతను - రఘునాథ్ - బంగళా అదిరేలా అరిచాడు! బాధ, అవమానం, ఆశ్చర్యం, కోపం అతనిలో తాండవమాడింది! జుత్తు పీక్కున్నాడు! గిజగిజ తన్నుకున్నాడు, ఏడ్చాడు! నాకు అప్పటికీ జాలి కలుగలేదు. కసితో, ఈర్ష్యగా నవ్వాను, అతను వెళ్ళాడు! అంతే!

నా జీవితంలో, మలుపు ఆరంభమైంది. క్రమంగా, నా ప్రవర్తన మారిపోయింది. గడిపే బ్రతుకుపై విసుగు, వెగటు కలిగాయి. అప్పుడు గుంటూర్లో డాక్టరుగా వుండేవాణ్ణి. చాలా రోజులకు మార్పు అవసరమని భావించి, ఓ నిర్ణయానికొచ్చి ఈ వూళ్ళో స్థిరపడ్డాను. చేసిన పాపాలకు, ప్రాయశ్చిత్తంగా నియమమూ, ప్రశాంతమూ అయిన జీవితం ఏర్పరచు కున్నా. ఎందుకో తెలుసా? గత జీవిత ఛాయలు పాకకుండా, చేతనైనంత సహాయమూ తోటివారికి చేయాలి అన్నదే నా పరమార్థంగా ఈ జీవిత చరమాంకంలో నిర్ణయించుకున్నా.

కథకుడు:

ఆ తర్వాత యిద్దరం లేచి యింటి దగ్గరకు వెళ్ళాం. నాలో తీరని సందేహాలు, అడ

గాలనుకున్న ప్రశ్నలు అలాగే వున్నాయి. అడుగుదామంటే ఆయన చెబుతారా, లేదా అన్నదే అనుమానం!

"నే వెల్తానండి! ప్రొద్దుగూకింది!" - యింటికెల్దామని అన్నా అలా!

కానీ ఆయన, "పనుంది రండి" అని పిలిచాడు. యింట్లోకి తీసుకెళ్ళి, "అమ్మా! జయా!" అని జయను పిలిచాడు - జయ వచ్చింది. యిదివరకటి విషాదచ్ఛాయ తొలగి ఆమె మొహం క్రమ్ముకున్న మేఘాలు తొలిగి, చంద్రోదయమైన ఆకాశంలా నిర్మలంగా వుంది.

"ఈవిడే జయ!" - జయ నమస్కరించింది.

"అడుగో ఆవిడ వెనకాల కొంగుపుచ్చుకు దొంగలా చూస్తున్నాడే వాడే మురళి" అని చూపారు వెంకటరత్నంగారు మురళిని నవ్వుతూ!

ముగింపు:

"యిలా వస్తారా వెంకటరత్నంగారూ?" అని పిలచా ఆయన్ను.

వచ్చారు. అవతలకు తీసుకెళ్ళి, "ఒక్క సందేహం? తీరుస్తారా?"

"అలాగే?"

"ఏమీ లేదు, మీ అబ్బాయి ఏమైనాడో తెలిసిందా?" - అడగరాని ప్రశ్న అడగినట్లు అడిగా!

ఆయన ఖిల్లుమని నవ్వాడు.

"అదా అనుమానం. మా ప్లీడరు మిత్రుడు దగ్గర్నుంచి, వచ్చిన ఉత్తరం ఏమిటంటావు?"

ఏమని చెప్పేది?

"కథలు గూడ వ్రాస్తావుగామాలు! మిగతా కథ అల్లలేవు! అయితే, నా కుమారుడు కొద్ది రోజుల క్రితం ప్లీడరు గారింటికి వచ్చాడట! యిలా వచ్చాడూ, కాస్త చిక్కిపోయినాడు. అంటే! నీ దగ్గరకు రావడానికి బిడియపడుతున్నాడు. నేను వెంట పెట్టుకు వస్తున్నాను. నువ్వు అన్ని మర్చిపొయ్యావని చెప్పాను, అతనికి. మేం రాగానే మామూలుగా పలకరించు. మిగతా కథ వచ్చి చెబుతాను" అని వ్రాశాడు.

"వచ్చారా మరి?"

"ఆహా, లేదు అలా షికారు వెళ్ళారు!"

"సంతోషం మీ కోడలు....."

"భలేవాడివయ్యా నువ్వు, జయా మా కోడలే! మురళీ నా మనవడే!"

ఆయన అబద్ధం చెప్పడని తెలుసు! నేనాశ్చర్యపోతానని ఆయనకూ తెలుసు. అసలు సంగతి, మీరైనా మా ఆవిడ చెవిన వెయ్యండి. •